సాక్షి కామారెడ్డి

శనివారం । 24 । మే । 2025



బీటీ రోడ్డు మరిచారు..

రాజంపేట మండలం కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి పరిధిలో అధికారులు బ్రిడ్జి పనులు పూర్తిచేయగా, బీటీ రోడ్డు పనులను మరిచారు.

- 10లో ▸



రోడ్డు, డ్రెయినేజీ ఆక్రమణ

బిచ్కుందలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండగా, రోడ్డు, డ్రెయినేజీ స్థలాలను పలువురు ఆక్రమించి షాపులు ఏర్పాటు చేశారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతం అవుతుంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'సాగర్'లోకి ఇన్‌ఫ్లో



నిజాంసాగర్(జుక్కల్): రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శుక్రవారం ఉదయం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,076 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా చేరుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు స్థానికంగా కురిసిన వర్షాల కారణంగా వాగుల ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1393.04 అడుగులు (5.567 టీఎంసీల) నీరు నిల్వ ఉందన్నారు.

ఈనెల 27 నుంచి యోగా కార్యక్రమాలు

కామారెడ్డి అర్బన్: జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల సందర్భంగా 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో హరిత యోగా, యోగా వాక్, యోగా సంగమం, యోగా ప్రభావ అనే నాలుగు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ (డీపీఎం) ఆకుల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి జూన్ 21 వరకు గ్రామ, మండల స్థాయిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వైద్యాధికారుల పర్యవేక్షణలో యోగా శిక్షకుల చేత ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. యోగా కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువతీయువకులు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. దేశ వారసత్వాన్ని, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసే కృషిలో అందరు పాలుపంచుకోవాలన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత




కామారెడ్డి టౌన్: ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష–2025లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి అంబీర్ జై శౌర్యదీప్ ఉత్తీర్ణత సాధించాడు. విద్యార్థి ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. ఈసందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

మెరుగైన సేవలందించాలి



కామారెడ్డి టౌన్: ప్రజలకు అత్యవసరంలో మరింత మెరుగ్గా సేవలను అందించాలని 108 అంబులెన్స్ స్టేట్ హెడ్ హెచ్ఆర్ కిరణ్ కిషోర్ సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని 108, 102 అంబులెన్స్ సేవలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హెచ్ఆర్ రవీందర్, ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, జిల్లా మేనేజర్ తిరుపతి, సిబ్బంది స్వామి, అనిల్, విజయ్, కృష్ణ స్వామి, కార్తీక్, సురేష్ తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను అకడమిక్ ఆడిట్‌సెల్ అడిషనల్ డైరెక్టర్ అతిక్ గోరీ సుల్తాన్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా తదితరులున్నారు.

మావోళ్లు ఎట్లున్నరో..



లోకేటి రమేశ్

లోకేటి లావణ్య అలియాస్ శాంతి

లోకేటి చందర్ అలియాస్ స్వామి

ఎర్రగొల్ల రవి అలియాస్ దినేష్

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో నక్సల్స్ ఏరివేత కొనసాగుతోంది. ఇందులోభాగంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో నక్సల్స్ చనిపోతుండడంతో జిల్లాకు చెందిన నక్సల్స్ గురించి చర్చ నడుస్తోంది. కామారెడ్డి జిల్లా నుంచి ఐదుగురు అజ్ఞాతంలో ఉన్నట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. దీంతో వారి కుటుంబాలు, బంధువులు తమ వారి పరిస్థితి ఎలా ఉందోనన్న ఆందోళన చెందుతున్నారు.

- అజ్ఞాతంలో జిల్లాకు చెందిన ఐదుగురు నక్సల్స్
- వరుస ఎన్‌కౌంటర్లతో వారి కుటుంబాల్లో ఆందోళన
- తమవారి క్షేమ సమాచారంపై ఆరా!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఇటీవల దండకారణ్యంలో కేంద్ర బలగాలు జరుపుతున్న దాడుల్లో పెద్ద సంఖ్యలో నక్సల్స్ చనిపోయారు. నిత్యం ఎక్కడో ఒక చోట ఎన్‌కౌంటర్ జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన అజ్ఞాత నక్సల్స్ గురించి జిల్లాలో చర్చ నడుస్తోంది. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన ఆ ఐదుగురు దశాబ్దాల కాలంగా ఇంటిని విడిచి వెళ్లారు. ప్రస్తుతం వారు ఎక్కడున్నరో, ఎట్లున్నరో కూడా ఆయా కుటుంబాలకు తెలియదు. కానీ కాల్పుల్లో నక్సల్స్ చనిపోయారని తెలిస్తే చాలు ఆ కుటుంబాలు వణికిపోతున్నాయి. వాళ్లు ఏ ప్రాంతంలో ఉన్నారో, ఎలా ఉన్నారోనని వారి కుటుంబాలు, బంధువులు ఆందోళన చెందుతున్నారు.

1990-2000లో విస్తృత కార్యకలాపాలు

ఉమ్మడి జిల్లాలో సీపీఐ(ఎంఎల్) పీపుల్స్ వార్ నక్సల్స్ కార్యకలాపాలు అప్పట్లో జోరుగా సాగేవి. కొన్ని ప్రాంతాల్లో నక్సల్స్ సమాంతర పాలన సాగించారు. 1990 నుంచి 2000 మధ్య కాలంలో ఆ పార్టీ కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. అయితే అప్పటి ప్రభుత్వాలు విధించిన తీవ్ర నిర్బంధంతో చాలా మంది లొంగిపోయారు. అలాగే అరెస్టులు, ఎన్‌కౌంటర్లతో జిల్లాలో ఆ పార్టీ తీవ్రంగా దెబ్బతింది. సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీ 2004లో సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించే నాటికి జిల్లాలో అనేక నష్టాలను చవిచూసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన అజ్ఞాత నక్సల్స్‌తో పాటు మిలిటెంట్లు, సానుభూతి పరులు 125 మంది వరకు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. వందలాది మంది అరెస్టయ్యారు. అలాగే వందలాది మంది లొంగిపోయారు. మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాత జిల్లా కార్యదర్శిగా పనిచేసిన గంగుల వెంకటస్వామి అలియాస్ రమేశ్ నాయకత్వంలో పార్టీ కార్యకలాపాలు మరింతగా విస్తరించాయి. ముఖ్యంగా ప్రభుత్వంతో చర్చల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఊరూరా సాయుధ నక్సల్స్ వెళ్లి సభలు, సమావేశాలు నిర్వహించారు. అదే సమయంలో మానాల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో జిల్లా కార్యదర్శి గంగుల వెంకటస్వామితో సహా 12 మంది మావోయిస్టులు చనిపోయారు. దీంతో జిల్లాలో మావోయిస్టు పార్టీ ఉనికి లేకుండాపోయింది. ఏదేమైనా ఎక్కడ, ఎప్పుడు ఎలాంటి ఎన్‌కౌంటర్ జరిగినా జిల్లాలో అజ్ఞాత నక్సల్స్ గురించి విస్తృత చర్చ జరుగుతోంది.

అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ వీరే..

- కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన లోకేటి చందర్ అలియాస్ స్వామి 1995లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ప్రస్తుతం దండకారణ్యంలో వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతనిపై రూ.20 లక్షల రివార్డు ఉందని జిల్లా ఎస్పీ వెల్లడించారు.
- పాల్వంచ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ దినేష్ 2001 లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఆజాద్ ప్రొటెక్షన్ టీంలో సభ్యునిగా పనిచేస్తున్నాడు. ఇతనిపై రూ .5 లక్షల రివార్డు ఉంది.
- కామారెడ్డి మండలం ఇస్రోజీవాడికి చెందిన లోకేటి రమేశ్ 2009లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఈయన లోకేటి చందర్ అలియాస్ స్వామి కొడుకు. తండ్రి బాటలోనే విప్లవోద్యమంలోకి వెళ్లాడు. సౌత్ బస్తర్‌లో కొంటా ఏరియా కమిటీ డీసీఎంగా పనిచేస్తున్నాడు. ఇతనిపై రూ.4 లక్షల రివార్డు ఉంది.
- లోకేటి లావణ్య అలియాస్ శాంతి 2009లో అజ్ఞాతంలోకి వెళ్లింది. ఈమె లోకేటి చందర్ అలియాస్ స్వామి కూతురు. ఏరియా కమిటీ మెంబర్‌గా పనిచేస్తోంది. ఈమెపై రూ.4 లక్షల రివార్డు ఉంది.
- సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన లింబయ్యగారి వెంకట్‌రెడ్డి 1999 నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. ఆయన ఎక్కడ పనిచేస్తున్నాడన్నది పోలీసులకు తెలియదు. అతనిపై రూ.లక్ష రివార్డు ఉంది.

పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- జిల్లాకేంద్రంలో పర్యటన



పట్టణంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని అశోక్ నగర్, స్నేహపురి కాలనీ, తదితర వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఎలాంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ కార్యక్రమాలు సజావుగా నిర్వహించాలని తెలిపారు.

సాక్షి కథనానికి స్పందన..

వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో ఈనెల 21న సాక్షిలో ప్రచురితమైన 'ముంచుకోస్తుంది వానాకాలం.. ముంపు సమస్యకేదీ పరిష్కారం' కథనానికి కలెక్టర్ స్పందించారు. పలు వార్డులో పర్యటించిన అనంతరం వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. వార్డు ఇన్‌చార్జిలు ప్రతిరోజు వార్డుల్లో పర్యటించి శానిటేషన్ కార్యక్రమాలు పరిశీలించాలని, అధికారులు కూడా పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, సహాయ ఇంజనీరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీవో పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: గ్రామ పాలన అధికారుల(జీపీవో) ఎంపిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 25న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసిన 402 మంది ఈ పరీక్ష రాస్తున్నారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతోపాటు గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. పరీక్ష కేంద్రంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. అభ్యర్థులు సమయ పాలన పాటించాలని సూచించారు. అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్డీవో వీణ, చీఫ్ సూపరింటెండెంట్ విశ్వ ప్రసాద్, పరిశీలకులు శంకర్, డీఈవో రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

- లబ్ధిదారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచన
- మంజూరు పత్రాల అందజేత



మంజూరు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

కామారెడ్డి రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో నిరుపేదైన కుంట్ల వినోదకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయగా, శుక్రవారం కలెక్టర్ భూమిపూజ చేసి ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరైన ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఇప్పటివరకు 708 ఇళ్లు మంజూరు కాగా, 74 ఇళ్లకు మార్క్ అవుట్ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు దశల్లో 11,153 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో కామారెడ్డి నియోజక వర్గంలో 3206, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 3496, జుక్కల్ నియోజక వర్గంలో 3019, బాన్సువాడ నియోజక వర్గంలో 1432 ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇందులో 2250 ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాగా పనులు పలు దశల్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రతీ సోమవారం ఇళ్ల నిర్మాణాలకు అనుగుణంగా విడతల వారీగా నిధులు చెల్లిస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్‌పాల్ రెడ్డి, గ్రామస్తులు కొమిరెడ్డి పెద్దనారాయణ, చిట్టబోయిన ప్రభాకర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు

- ఏడీఏ అపర్ణ
- మద్నూర్‌లో విత్తన దుకాణాల తనిఖీ



మద్నూర్‌లో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

మద్నూర్(జుక్కల్): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ అపర్ణ అన్నారు. మండల కేంద్రంలోని విత్తనాలను శుక్రవారం కామారెడ్డి విత్తన తనిఖీ బృందం అధికారులు, ఏడీఏ తనిఖీలు నిర్వహించారు. విత్తన దుకాణాల్లో, గోదాముల్లో దుకాణదారులు స్టోర్ చేసి పెట్టుకున్న విత్తనాల బ్యాగులను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. రానున్న వానాకాలం పంటలకు సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించారు. విత్తనాల కంపెనీల వివరాలు, పీసీలు, బిల్లులు, ఇన్‌వాయిస్ ఉంచుకోవాలన్నారు. రైతులకు విక్రయించే విత్తనాలకు రసీదులు తప్పకుండా ఇవ్వాలన్నారు. రైతులు లైసెన్స్‌లు కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని ప్యాకింగ్ లేనివి, దళారుల వద్ద విత్తనాలు తీసుకోరాదన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన తనిఖీ బృందం కామారెడ్డి ఏవో పవన్‌కుమార్, బీబీపేట్ ఏవో నరేంద్ర, ఏవో రాజు, డీలర్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఇక్కట్లు



బీబీపేటలో వర్షానికి కూలిన ఇల్లు

బీబీపేట: గత రెండు రోజులుగా అకాల వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు, రైతులు ఇక్కట్లు పడుతున్నారు. మండల కేంద్రంలోని మెట్టు నర్సింలుకు చెందిన ఇల్లు అర్ధరాత్రి కూలింది. ఇంట్లోని కుటుంబ సభ్యులు బయట గదిలో నిద్రిస్తుండడంతో ప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు తడుస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన కాంటాలు పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నారు.

అయ్యో.. రైతన్న కష్టం వృథాయేనే!

- వానలకు తడిచి, మొలకెత్తిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం
- సకాలంలో తూకాలు జరుగక.. లారీలు రాక.. నాశనమైన పంట





లింగారెడ్డిపేటలో వర్షాలకు తడిచి మొలకెత్తిన ధాన్యం.. తడిచిన ధాన్యాన్ని చూపుతున్న అన్నదాతలు

ఎల్లారెడ్డి: ఆరుగాలం కష్టించి పండించిన పంట వానల వల్ల పనికిరాకుండా పోవడంతో రైతన్న కళ్లు కన్నీటి పర్యంతం అవుతున్నాయి. చేతికొచ్చిన పంటను సకాలంలోనే కొనుగోలు కేంద్రాలకు తరలించినా హమాలీలు లేరంటూ, లారీలు రావడం లేదంటూ నెల రోజులకు పైగా కొనుగోలు కేంద్రాలలో ఎండకు ఎండి వానకు నానిన పంట మొలకలెత్తి పనికిరాకుండా పోయింది. దీంతో రైతన్న కష్టం వృథాగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

మిగిలిపోతున్న తడిచిన ధాన్యం..

ఎల్లారెడ్డి మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్న ధాన్యం రాశులు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిచి ముద్దయ్యాయి. తడిచిన ధాన్యం ఉంటే రైస్ మిల్లర్లు తిప్పి పంపడం లేదా తరుగు పేరిట చేస్తున్న లూటీని దృష్టిలో పెట్టుకుని రైతులు పొడి ధాన్యాన్ని మాత్రమే తూకం చేయిస్తున్నారు. ప్రతీ రైతు ధాన్యంలో క్వింటాల్ నుంచి ఐదు క్వింటాళ్ల వరకు మిగిలిపోతున్న తడిచిన ధాన్యాన్ని ఎవరికి కొనుగోలు చేయాలో కొనుగోలు కేంద్రం సిబ్బంది తెలపడం లేదు. కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షానికి తడిచిన ధాన్యం అడుగుభాగాన మొలకలెత్తాయి. మొలకెత్తిన ఈ ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేస్తారంటూ రైతులు బావురుమంటున్నారు. తడిచిన ధాన్యాన్ని ఏదో ఒక ధరకు రైస్‌మిల్లర్లకు అమ్మేసుకోవాలని సిబ్బంది రైతులకు సలహా ఇస్తున్నట్లు సమాచారం.

నమోదులో కూడా తీవ్ర జాప్యం..

రైతులు అమ్మిన ధాన్యానికి 48 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వస్తాయని నాయకులు, అధికారులు చెబుతున్న ప్రకటనలు వాస్తవానికి జరగడం లేదు. ధాన్యాన్ని మిల్లుకు తరలించాక రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన కేంద్రం నిర్వాహకులు జాప్యం చేస్తున్నారు. దీనివల్ల అన్ని పత్రాలు ఇచ్చినా రోజుల తరబడి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో రైతులకు అగచాట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరిపి, మిల్లులకు తరలించి, రైతులకు డబ్బులు వచ్చేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రైస్ మిల్లర్ల దోపిడీ..

కొన్ని రోజులు కొనుగోళ్లు జరగక ఇబ్బంది పడ్డ రైతులు నేడు హమాలీ, లారీల సమస్యలతో పంట నాశనం కావడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. తీరా లారీలు వచ్చి కాంటాలు జరిగినా తరుగు పేరిట రైస్ మిల్లర్లు చేస్తున్న దోపిడీకి అడ్డుకట్ట లేకుండా పోయింది. ధాన్యంలో ఔటానా(బియ్యం శాతం) రావడం లేదంటూ రైస్ మిల్లర్లు ప్రతీ లారీకి 20 నుంచి 40 సంచుల వరకు తరుగు కింద తీసి వేస్తున్నారు. ఇటీవల ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఒక పారా బాయిల్డ్ రైసుమిల్లు వారు 680 సంచులు ఉన్న లారీ నుంచి 40 సంచులను తరుగు కింద తీసివేశారు. దాదాపు 16 క్వింటాళ్ల ధాన్యం తరుగు కింద తీసివేస్తే తాము ఎలా బతికేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా సదరు రైస్‌మిల్లు యజమానితో మాట్లాడి తరుగు తక్కువ చేయిస్తామని సమాధానమిచ్చారు. రైతులు జల్లెడ పట్టకుండా నేరుగా ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని ఇందువల్ల బియ్యం పర్సంటేజ్ రావడం లేదంటూ మిల్లర్లు కోత పెడుతున్నారని అధికారులు అంటున్నారు.

మొలకెత్తిన ధాన్యాన్ని ఎవరికి అమ్మాలి..



కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యానికి తూకం జరిగినా, లారీలు రాక పోవడంతో తరలించడం జరగలేదు. గత కొద్ది రోజుల క్రితం పడిన వర్షానికి తడిచిన ధాన్యం మొలకలెత్తింది. ఇలా మొలకెత్తిన ధాన్యాన్ని ఎవరికి అమ్ముకోవాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమను ఆదుకోవాలి.

– సిద్దు, రైతు, లింగారెడ్డిపేట

తడిసిన ధాన్యాన్ని కొంటాం..

వర్షాలకు కొనుగోలుకేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తాం. అయితే రైతులు తడచిన ధాన్యాన్ని ఎండపెట్టి విక్రయించాల్సి ఉంటుంది. మొలకత్తిన ధాన్యం విషయంలో ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. జిల్లాలో ఇప్పటి వరకు 594 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసాం. ఇంకా ఐదు వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా శుక్రవారం 2500 టన్నులు కొనుగోలు చేశాం.

– మల్లికార్జునరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఒకేసారి మూడు నెలల రేషన్!

- జూన్ నెలలో పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు

కామారెడ్డి రూరల్: వర్షాకాలానికి ముందే మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని పౌరసరఫరాలశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా రేషన్ డీలర్లు మూడు నెలలకు సంబంధించి అనగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యంను జూన్ నెలలోనే పంపిణీ చేయాల్సి ఉంటుంది. జూన్ నుంచి వానాకాలం మొదలవుతుందని, వర్షాకాలంలో వరదలు, వాగులు, వంకలు పొంగటం వంటి సమస్యలు ఎదురైతే పేద ప్రజలకు ఆహారధాన్యాలు చేరవేయడం ఇబ్బందిగా మారుతుందన్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 3 నెలల రేషన్‌ను జూన్‌లోనే పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన సంగతి తెలిసిందే.

రేషన్ డీలర్లకు ఇబ్బందులే..

రాష్ట్ర ప్రభుత్వం గత రెండు నెలల క్రితం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించగా అప్పటి వరకు ఉన్న దొడ్డు బియ్యం స్టాకు నిల్వలను ఇప్పటి వరకు రేషన్ షాపుల నుంచి తీసుకుపోలేదు. అంతేకాకుండా ఇప్పుడు మూడు నెలల బియ్యం ఒకే నెలలో పంపిణీ చేయాలంటే మూడు నెలలకు సంబంధించిన బియ్యం నిల్వ చేసుకోవడానికి సరిపడా రూంలు అందుబాటులో ఉండవని రేషన్‌డీలర్లు వాపోతున్నారు. అలాగే రేషన్ లబ్ధిదారులు సైతం ఒక కార్డులో నలుగురు ఉంటే నెలకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున పంపిణీ చేయాల్సి ఉండేది. ఒకేసారి మూడు నెలల బియ్యం అంటే 72 కిలోలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఇటు రేషన్ డీలర్లకు, అటు వినియోగదారులకు తిప్పలు తప్పవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో 10,213 మంది విద్యార్థులకు 9,433 మంది హాజరుకాగా 780 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 6,564 మంది విద్యార్థులకు 6,096 మంది హాజరుకాగా 468 మంది గైర్హాజరయ్యారు.

మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 3,649 మంది విద్యార్థులకు 3,333 మంది హాజరు కాగా 316 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఆర్మూర్ నరేంద్ర డిగ్రీ కాలేజీ పరీక్ష కేంద్రంలో ఒకరు, మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పరీక్ష కేంద్రంలో ఒకరు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడగా డిబార్ చేశామన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ ప్రశ్నాపత్రాల పరిశీలన



డిచ్‌పల్లి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం డీఐఈవో తిరుమలపూడి రవికుమార్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుడు చిన్నయ్యతో కలిసి డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో భద్రపర్చిన ఇంటర్ ప్రశ్నాపత్రాల బాక్సులు, ఫైళ్లను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల కస్టోడియన్లు, చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల సమయపాలన, పనితీరును పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిచ్‌పల్లి మోడల్ కాలేజ్, ధర్మారం(బి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇన్‌స్టాలో ఉద్యోగాల పేరిట సైబర్ మోసం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్ పీఎస్ పరిధిలోని ఇద్దరు వ్యక్తులు ఇన్‌స్టాలో ఉద్యోగం పేరిట వచ్చిన యాడ్‌కు నగదు చెల్లించి సైబర్ మోసానికి గురైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం.. నగరంలోని ఎల్లమ్మగుట్ట, శ్రీనగర్‌కాలనీకి చెందిన ఇద్దరు ఇన్‌స్టాలో ఉద్యోగాల పేరిట యాడ్ రావడంతో వారిని అప్రోచ్ అయినట్లు తెలిపారు. ఉద్యోగంలో చేరడానికి టాస్క్ ఉంటుందని చెప్పిన సైబర్ నేరస్తులు దానికి కొంత నగదు చెల్లించాలని చెప్పడంతో వారు నగదును చెల్లించారు. తర్వాత టాస్క్ అప్రూవ్ కావడానికి మరి కొంత నగదు వేయాలని చెప్పి ఒకరి నుంచి రూ.65 వేలు, మరొకరి నుంచి రూ.64 వేలు వసూలు చేశారు. దీంతో ఉద్యోగం తోపాటు నగదు తి రిగి రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఇతర సోషల్‌మీడియాలో వచ్చిన యాడ్స్, లింకులను ఓపెన్ చేయొద్దని ఎస్సై సూచించారు.

ఏసీబీ అధికారులమంటూ ఫోన్..

మాక్లూర్: ఏసీబీ అధికారులమంటు సైబర్ నేరస్తులు ఎంపీడీవోని బెదిరించి నగదు కావాలని డిమాండ్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాక్లూర్ ఎంపీడీవో లక్ష్మారెడ్డికి సైబర్ నేరగాళ్లు గురువారం ఫోన్ చేశారు. ఏసీబీ దాడులు చేయకుండా ఉండాలంటే రూ. రెండు లక్షలు కావాలంటు వారు డిమాండ్ చేశారు. దీంతో ఎంపీడీవో పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రిడ్జి నిర్మించారు.. బీటీ రోడ్డు మరిచారు

- రాజంపేట మండలంలో చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అన్నారం గ్రామ పరిధిలోని బ్రిడ్జి వద్ద పోసిన మట్టి



ఎల్లారెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

రాజంపేట : మండలంలోని కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల పరిధిలో నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఒక్కో బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3.43 కోట్లను కేటాయించారు. బ్రిడ్జీల నిర్మాణ పనులు పూర్తయినా బీటీ రోడ్డు వేయకుండా వదిలేశారు. దీంతో కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు పనుల నిమిత్తం జిల్లాకేంద్రం వెళ్లడానికి, పక్కనే మెదక్ జిల్లాకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదాలు జరిగినా..

మండలంలోని అన్నారంనికి వెళ్లే మార్గంలో నూతన బ్రిడ్జి నిర్మించి బీటీ రోడ్డు వేయలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నా రు. బ్రిడ్జి వద్ద మరమ్మతులు చేయపోవడంతో ఆచోట మట్టి కృంగింది. నాలుగు నెలల క్రితం ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి వద్ద బీటీ రోడ్డు వేయాలని ఆయా గ్రామాల పరిధి ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు పనులు చేపట్టాలి

నూతన బ్రిడ్జీల వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. వర్షాలకు మట్టి కృంగిపోవడంతో ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం సమీపిస్తుండటంతో బ్రిడ్జి వద్ద మట్టి కృంగిపోతుంది అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి. – శ్రీనివాస్, ఎల్లారెడ్డిపల్లి తండా

నిధులు విడుదల కాకపోవడంతోనే..

నూతన బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్లకు సకాలంలో నిధలు విడుదల కాకపోవడంతోనే బ్రిడ్జిల వద్ద పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పనులు పూర్తిచేసి బీటి రోడ్డు పూర్తి చేసేలా కాంట్రాక్టర్లను ఆదేశిస్తా. – ఆర్‌అండ్‌బీ డీఈఈ, శ్రీనివాస్, ఎల్లారెడ్డి

ఆర్‌అండ్‌బీ రోడ్డు, డ్రెయినేజీ ఆక్రమణ



బిచ్కుందలో రోడ్డుపై వెలిసిన చికెన్ సెంటర్



ఇరుకైన రోడ్డు గుండా వెళ్తున్న వాహనాలు

- బిచ్కుందలో రోడ్డుపై నిలుస్తున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ కోసం అధికారులు రెండు వైపులా రోడ్డు తవ్వి మురికి కాలువలు నిర్మించి రోడ్డును వెడల్పు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న పలు షట్టర్ల యజమానులు తమ ముందు ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలం, మురుగు కాలువ ఆక్రమించి షాపులను ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చారు. ఏబీఐ బ్యాంక్ ముందు తారురోడ్డుకు అనుకొని చికెన్ సెంటర్లు ఇతర దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. రోడ్డుకు అనుకొని 30 నుంచి 40 చదరపు అడుగుల స్థలం ఆక్రమించడంతో అక్కడ రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అక్కడ తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా రోడ్డుపై మురుగు నిలువడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో న్యాయవాదులు చికెన్ సెంటర్లు తొలగించాలని ఫిర్యాదు చేశారు. చికెన్ సెంటర్లను మాంసం విక్రయించే మార్కెట్‌కు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

మురికి కాలువలు, రోడ్డును ఆక్రమించి వేసిన దుకాణాలను వెంటనే తొలగిస్తాం. మండల ఎంపీవో, జీపీ కార్యదర్శి పరిశీలించి సమస్య పరిష్కరిస్తారు. మురుగు రోడ్డుపై ని లువకుండా మట్టి తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తాం. – మురళి, డీపీవో, కామారెడ్డి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



గోవింద్‌పేట్ చౌరస్తాలో తడిసిన ధాన్యంతో రాస్తారోకో చేస్తున్న రైతులు

పెర్కిట్: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ మామిడిపల్లి గ్రామంలోని గోవింద్‌పేట్ చౌరస్తాలో తడిసిన ధాన్యంతో రైతులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఆలస్యంగా కొనుగోళ్లు చేపట్టడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వంగా కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో రాజాగౌడ్, ఎస్‌హెచ్‌వో గోవింద్‌పేట్ చౌరస్తాకు చేరుకొని కొనుగోళ్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అనంతరం కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని ఆర్డీవో పరిశీలించారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజా గౌడ్

పిట్లం ఏఎస్సై లింబాద్రికి ఎస్సైగా పదోన్నతి



లింబాద్రికి పదోన్నతి చిహ్నాన్ని అలంకరిస్తున్న డీఎస్పీ

పిట్లం(జుక్కల్): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న లింబాద్రికి ఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా బాన్సువాడలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి డీఎస్పీ విఠల్‌రెడ్డి లింబాద్రికి పదోన్నతి చిహ్నాన్ని అలకరించి అభినందనలు తెలిపారు. లింబాద్రికి పదోన్నతి లభించడంతో తోటి సిబ్బందిశుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ ఇంగ్లిష్ ఫస్టియర్ పరీక్షలు శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1,867 మంది హాజరు కాగా 245 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1,431మంది హాజరు కాగా 100 మంది గైర్హాజరయ్యారు. డీఐఈవో జిల్లా కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, కనక మహాలక్ష్మి ఏడు పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్‌లు ఆరు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 12 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

మెయింటెనెన్స్ పై నిర్లక్ష్యం తగదు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యం తగదని నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఇంజినీరింగ్ ఇన్ ఛీఫ్ మెయింటెనెన్స్) శ్రీనివాస్ అధికారులు, ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. వరద గేట్లను, కాకతీయ కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను, ఫ్లడ్ కంట్రోల్ రూంలో నీటి మట్టాన్ని, డ్యాంను పరిశీలించి పలు వివరాలను అధికారులు, ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. గేట్లు, డ్యాం పై మెయింటెనెన్స్ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే తలెత్తే ఇబ్బందుల గురించి వివరించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్ట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ చక్రపాణి, డిప్యూటీ ఈఈ గణేశ్, ఏఈఈలు, సిబ్బంది ఉన్నారు.

జీజీహెచ్‌లో పెచ్చులూడిన సీలింగ్

- నవజాత శిశువుకు గాయాలు
- తప్పిన పెను ప్రమాదం



స్లాబ్ పై పెచ్చులూడిన ప్రాంతం



జీజీహెచ్‌లో బెడ్‌పై పడిన పెచ్చులు

నిజామాబాద్ నాగారం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జీజీహెచ్ మొదటి అంతస్తులో పెచ్చులూడుతున్నాయి. శుక్రవారం రూంనంబర్ 178లో బెడ్ నంబర్ 11పై నవజాత శిశువు ఉండగా ఘటన చోటు చేసుకుంది. సీలింగ్ పెచ్చులు ఊడి నాలుగు రోజుల క్రితం ఫాతిమా బేగంకు జన్మించిన పాప ముఖంపై పడ్డాయి. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్పందించిన సిబ్బంది శిశువును మరో వార్డుకు తరలించి చికిత్స అందించారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌చార్జి శ్రీనివాస్

ఎల్లారెడ్డి: పట్టణంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఎల్లారెడ్డి షీ టీం ఇన్‌చార్జి శ్రీనివాస్ విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డయల్ 100 ప్రాధాన్యతను వివరించారు. మహిళలు లైంగిక, శారీరక వేధింపులకు గురైతే షీ టీం సభ్యులను సంప్రదించాలన్నారు. ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో షీటీం సహాయం కోసం 8712686094 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు డయల్ చేయాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియామాలు పాటించాలని సూచించారు. యువత డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని కోరారు. పాఠశాల ఎంఆర్‌వో రాజు, షీ టీం సభ్యులు పాల్గొన్నారు.

లోతైన దుక్కులతో తెగుళ్ల నివారణ

నవీపేట: లోతైన దుక్కులతో పంటలను ఆశించే తెగుళ్లను నివారించవచ్చని రుద్రూర్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన రైతులకు సూచనలు చేశారు. వేసవిలో లోతైన దు క్కులతో నేలతో సంక్రమించే పురుగులను నాశనం చేయవచ్చని వివరించారు. వ్యవసాయాధికారులు సూచించిన మోతాదులోనే యూరియా, ఎరువులను వాడాలని సూచించారు. విత్తన శుద్ధి ప్రాధాన్యతను రైతులకు వివరించారు. శాస్త్రవేత్త పద్మావతి మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి పద్ధతిని అలవాటు చేసుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో బాలుడు, మరో ముగ్గురి మృతి



సాత్విక్ (ఫైల్)

గాంధారి/ లింగంపేట: బంధువుల పెళ్లికి వచ్చి ఓ బాలుడు మృతి చెందిన ఘటన గాంధారి మండల పరిధిలోని ఎక్కకుంట తండాలో చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలం కొండాపూర్ తండాకు చెందిన లలిత, రాజ్‌కుమార్ దంపతులు వారి రెండేళ్ల కుమారుడు సాత్విక్(2)తో కలిసి బుధవారం బంధువుల పెళ్లికి ఎక్కకుంట తండాకు వచ్చారు. బయట పెళ్లి వంటలు చేసి ఉంచారు. రాత్రి వర్షం రావడంతో వండిన వంట పాత్రలను ఇంట్లో పెట్టారు. సాంబారు పాత్రపై మూత వేయడం మర్చిపోయారు. సాత్విక్ ప్రమాదవశాత్తు వేడిగా ఉన్న సాంబారులో పడిపోయాడు. గమనించిన బంధువులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులును సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కారు ఢీ కొని ఒకరు..



సిద్ధయ్య మృతదేహం

మాచారెడ్డి: కారు ఢీ కొన్న ఘటనలో ఓ సైక్లిస్ట్ మృతి చెందాడు. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన మాస్తు చిన్న సిద్ధయ్య(57) గురువారం రాత్రి పాల్వంచ మర్రి నుంచి సైకిల్ పై పాల్వంచకు వెళ్తుండగా కామారెడ్డి వైపు నుంచి అతివేగం, అజాగ్రత్తగా వస్తున్న కారు ఢీకొన్నది. సిద్ధయ్య తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



రాహుల్ మృతదేహం

భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన పోతుల రాహుల్ అనే యువకుడు బైక్‌పై కామారెడ్డి నుంచి భిక్కనూరు మండల కేంద్రానికి గురువారం వస్తుండగా టోల్ ప్లాజా వద్ద వెనుక నుంచి కారు ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి మరొకరు..



జ్యోతి మృతదేహం

బిచ్కుంద: బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన బిచ్కుంద శివారులోని పెద్ద మైసమ్మ గుడి వద్ద చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతడ్గూర్‌కు చెందిన మంగళి సునీల్, భార్య జ్యోతి(26)తో కలిసి బైక్‌పై బిచ్కుందకు వస్తున్నారు. బిచ్కుంద శివారులో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కింద పడడంతో జ్యోతి తలకు తీవ్రగాయమైంది. స్థానికులు బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



గంగారాం మృతదేహం

బాన్సువాడ రూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ఉల్లబోయిన గంగారాం(56)కు ముగ్గురు కుమారులు. వీరు బతుకుదెరువు నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. గ్రామంలో గంగారాం ఒక్కడే నివాసం ఉంటున్నాడు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అతను గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీ కొని ఇద్దరికి గాయాలు



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో శుక్రవారం టీ తాగుతున్న ఇద్దరు యువకులను మహారాష్ట్ర నుంచి వేములవాడ వెళ్తున్న కారు ఢీకొన్నది. ఈ ఘటనలో యువకులకు గాయాలు కాగా రోడ్డు పక్కన పార్క్ చేసిన నాలుగు బైకులు ధ్వంసమయ్యాయి. స్థానికులు గాయపడ్డ యువకులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నిందితుడి రిమాండ్

ఖలీల్‌వాడి: పాత కక్షలతో ఒకరిపై దాడి చేసిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన దోమల సాయికుమార్‌కు కన్నిగిడె సాయికుమార్ అలియాస్ సాయినాథ్‌కు పాత కక్షలు ఉన్నాయి. ఈ నెల 20న నగరంలోని బోధన్ రోడ్డులో ఉన్న మైఫిల్ హోటల్ వద్ద కనిపించిన సాయికుమార్‌పై సాయినాథ్ కత్తితో దాడి చేశాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వడ్ల లారీ బోల్తా



లింగంపేట: మండలంలోని బూరుగిద్ద శివారులోని మూలమలుపు వద్ద శుక్రవారం వడ్ల లారీ బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. లింగంపేట మండలం అయిలాపూర్‌లో ధాన్యం లోడ్ చేసుకొని చిట్యాలలోని రైస్ మిల్లుకు వెళ్తుండగా బూరుగిద్ద వద్ద అదుపుతప్పి పడిపోయినట్లు తెలిపారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

వర్షానికి కూలిన ఇల్లు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో మూడు రోజులు కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు అంతర్గత రోడ్లు చిత్తడిగా మారాయి. వాహనదారులకు గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రైతుబజార్ వర్షానికి చిత్తడిగా మారడంతో విక్రయదారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏకదాటిగా కురుస్తున్న వర్షానికి సంతోష్‌నగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. కాగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. మున్సిపల్ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించారు.

జక్రాన్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన కంటైనర్
- ఇద్దరు దుర్మరణం
- మృతులు బావబామ్మర్దులు



శ్రీనివాస్(ఫైల్)



నవీన్(ఫైల్)



బోల్తా పడిన కంటైనర్

జక్రాన్‌పల్లి: మండలంలోని వివేక్ నగర్ తండా సమీపంలో 44 నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌ను వెనుక నుంచి కంటైనర్ ఢీకొనడంతో వివేక్ నగర్ తండాకు చెందిన బానోత్ శ్రీనివాస్ (35), కేశ్‌పల్లి తండాకు చెందిన బాదావత్ నవీన్ (27) అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. బానోత్ శ్రీనివాస్ తన అన్న శంకర్ నాయక్ పెళ్లిరోజును పురస్కరించుకొని కేక్ తీసుకురావడం కోసం జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి వెళ్లారు. కేక్ తీసుకొని తిరిగి వస్తుండగా వివేక్‌నగర్ తండా సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన కంటైనర్ బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న బానోత్ శ్రీనివాస్, బాదావత్ నవీన్ కొద్దిదూరం ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. కంటైనర్ పల్టీ కొట్టింది. ఘటనా స్థలాన్ని ఎస్సై మాలిక్ రెహమాన్ పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ కేబుల్ టీవీ నిర్వహిస్తుండగా, భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బాదావత్ నవీన్ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బస్సును సొంతంగా కొనుగోలు చేసి ఆర్టీసీలో అద్దెకి నిర్వహిస్తున్నారు. నవీన్‌కు ఇంకా పెళ్లి కాలేదు. కాగా, మృతులిద్దరూ స్వయాన బావ బామ్మర్దులు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేశ్

ఆర్మూర్‌టౌన్: అత్యంత అరుదైన గిలియన్ బారే సింద్రోమ్ వ్యాధితో బాధపడుతున్న నరేశ్ చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కొండ్రపేట నరేశ్ వారం రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స కోసం ఆర్మూర్‌తో పాటు నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించినా చికిత్స అందలేదు. పరిస్థితి విషమించడంతో ఐదురోజుల క్రితం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు నరేశ్ గిలియన్ బారే సింద్రోమ్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో అతని కాళ్లు, చేతులు చచ్చుపడిపోయాయి. చికిత్స కోసం రూ. 2 నుంచి రూ. 3లక్షల వరకు ఖర్చు అవుతోంది. చిన్ననాడే తండ్రిని కోల్పోయిన నరేశ్ తల్లితో పాటు ఇద్దరు తమ్ముళ్ల బాగోగులు చూస్తు పెద్దదిక్కుగా మారాడు. ఉన్నఫలంగా అరుదైన వ్యాధి సోకడంతో కుటుంబం తల్లడిల్లిపోతోంది. నరేశ్‌కు మూడేళ్ల క్రితం వివాహం కాగా రెండేళ్ల బాబు ఉన్నాడు. ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. నరేశ్ ఫోన్ పే నంబర్ 8688365656, ఎస్‌బీఐ ఐఎఫ్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0020894, అకౌంట్ నంబర్ 62148693494కు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.